టిప్పర్లతో గ్రామీణ రోడ్లు ధ్వంసం

- ఓవర్‌లోడ్‌తో నిత్యం రాకపోకలు
- 12 అడుగుల రోడ్డులో 70 టన్నులతో వెళ్తున్న లారీలు



జాతీయ రహదారిపై వేంపాడు జంక్షన్‌లో శిథిలమయిన రోడ్డు



వేంపాడు పాటిమీద రోడ్డులో గోతులు పడిన దృశ్యం



కాగిత ఎస్సీ కాలనీలో గోతులు పడిన వీధిరోడ్డు

నక్కపల్లి: జాతీయ రహదారిపై కాగిత వద్ద టోల్ ఫీజు ఎగ్గొట్టేందుకు టిప్పర్ లారీలు దొడ్డిదారిలో ప్రయాణిస్తున్నాయి. ఇవి ఓవర్‌లోడ్‌తో రావడంతో ఎక్కడికక్కడే గోతులు పడి గ్రామీణ రోడ్లు ధ్వంసమవుతున్నాయి. మెయిన్‌రోడ్డు నుంచి గ్రామాల్లో నివసించే వారు ఉపయోగించుకునేందుకు వీలుగా నిర్మించిన వీధిరోడ్లను సైతం వదలడం లేదు. పది కాలాల పాటు మన్నికగా ఉండాల్సిన ఈ రోడ్లు కొన్ని మాసాలకే పాడవుతున్నాయంటూ ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

రాజమహేంద్రవరం నుంచి అనకాపల్లి, పరవాడ, రాంబిల్లి యలమంచిలి తదితర ప్రాంతాలకు బండరాళ్లు, ఇసుకను ఓవర్‌లోడ్ చేసుకుని వెళ్లే టిప్పర్లు మెయిన్ రోడ్డు మీదుగా కాకుండా వేంపాడు, చందనాడ, మూలపర, నర్సాపురం, తమ్మయ్యపేట, ఉపమాక, కాగిత మీదుగా వెళ్తున్నాయి. సాధారణంగా 40 టన్నుల సామర్థ్యం వరకు టిప్పర్లకు అనుమతి ఉంది. 40 టన్నులు దాటితే అపరాధ రుసుం వసూలు చేస్తారు. కాగిత టోల్‌ప్లాజా వద్ద టిప్పర్లను వేబ్రిడ్జి వద్ద తనిఖీలు చేస్తున్నారు. 40 టన్నుల కంటే ఎక్కువ బరువు ఉంటే రూ.3 వేల వరకు అదనంగా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఫీజును ఎగ్గొట్టేందుకు డ్రైవర్లు, టిప్పర్ యజమానులు వేంపాడు నుంచి చందనాడ మీదుగా ఉపమాక చేరుకుని అక్కడ నుంచి నక్కపల్లి జాతీయ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు.

పరిమితికి మించి బరువుతో రాకపోకలు

రాజమహేంద్రవరంలో గోదావరి నది నుంచి ఇసుక తీసుకు వచ్చే లారీలు సైతం ఇలాగే పరిమితికి మించి బరువుతో రాకపోకలు సాగిస్తుంటాయి. ఇలా గ్రామాల్లో నుంచి వెళ్లడం వల్ల జాతీయ రహదారి నుంచి వేంపాడు వెళ్లే జంక్షన్‌లో రోడ్డు శిథిలయమయింది. వేంపాడులో రామాలయం వీధి జంక్షన్‌లో పెద్ద గోయి ఏర్పడి వర్షం పడితే చెరువును తలపిస్తోంది. పాటిమీద సమీపంలో రోడ్డు ఎక్కడికక్కడ గోతులు పడింది. ఇక కాగిత ఎస్సీ కాలనీ, దుర్గాదేవి ఆలయంలో వీధులు సైతం పూర్తిగా పాడయ్యాయి. ఇరుకు వీధుల్లో నుంచి భారీ వాహనాలు రాకపోకల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళనలు గ్రామస్తుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

కంటిమీద కునుకు ఉండటం లేదని వేదన

అర్ధరాత్రి సమయంలో భారీ వాహనాలతో వెళ్లే వాహనాల వల్ల కంటిమీద కునుకు ఉండటం లేదని, వీధిరోడ్లో వెళ్లే సమయంలో ఏదైనా బండరాయి జారిపడటం, ప్రమాదం జరిగి వాహనం బోల్తా పడినా పెను ప్రమాదం జరుగుతుందని నివాస ప్రాంతాల వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేవలం 10 నుంచి 12 అడుగుల వెడల్పు కలిగిన వీధిరోడ్ల నుంచి 70 టన్నుల బరువుతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వీటి వల్ల తమ అవసరాల కోసం నిర్మించిన రోడ్లు నాశనమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బల్క్ డ్రగ్ పార్క్ పనుల కోసం వెళ్లే వాహనాలు ఇలాగే రాకపోకలు సాగిస్తున్నాయంటున్నారు. ఇలా అడ్డదారిలో ప్రయాణిస్తున్న టిప్పర్లను పట్టుకుని పోలీసులు కేసులు నమోదు చేస్తున్నప్పటికీ డ్రైవర్లలో మార్పు రావడం లేదు. ఇటీవల సీఐ కుమారస్వామి ఇలా అడ్డదారిలో వస్తున్న లారీలను పట్టుకుని రూ.1.82 లక్షల పెనాల్టీ విధించారు. రెండు రోజులు తర్వాత మళ్లీ మామూలుగానే ఈ లారీలు రాకపోలు సాగిస్తున్నాయి.

రోడ్లు పూర్తిగా పాడయ్యాయి

గ్రామాల్లో తమ అవసరాల కోసం వేసిన చిన్నపాటి రోడ్లలో భారీ వాహనాలు వెళ్లడం వల్ల రోడ్లు పాడవుతున్నాయి. ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తూ బోల్తా పడిన ఘటనలు ఉన్నాయి. నివాస ప్రాంతాల వారు భయాందోళనలు చెందుతున్నారు, ఎస్సీ కాలనీలో రోడ్లు పూర్తిగా పాడయ్యాయి. అధికారులు స్పందించాలి.

– పి.బాబ్జి, కాగిత

పోలీసులకు సమాచారం ఇవ్వాలి

జాతీయ రహదారి మీదుగా కాకుండా గ్రామాల్లో నుంచి పరిమితికి మించి బరువుతో వెళ్తున్న వాహనాలను వదిలే ప్రసక్తి లేదు. టోల్‌ఫీజు ఎగ్గొట్టడం కోసం ఇలా అడ్డదారిలో వెళ్తున్నారు. వారం రోజుల క్రితం మూడు లారీలు పట్టుకుని పెనాల్టీ విధించాం. వాహనాలు ఇలా వెళ్తే నిలిపివేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

– కుమార స్వామి, సీఐ, నక్కపల్లి

చిక్కాల పరామర్శ



నర్సింహరాజుని పరామర్శిస్తున్న చిక్కాల రామారావు

పాయకరావుపేట: మండలంలో శ్రీరాంపురం గ్రామ శాఖ పార్టీ అధ్యక్షుడు తిరుమలరాజు నర్సింహరాజును వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు ఆదివారం పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన నర్సింహరాజు తునిలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నారు. అక్కడికు వెళ్లి ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. గోపాలపట్నం, మాసాహేబుపేట సర్పంచ్‌లు పన్నీరు బాబ్జి, గెడ్డమూరి నీలవేణి శ్రీనివాసరావు, పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోడపాటి గోవిందు, నాయకులు పులగల రాంబాబు, బగ్గ వినన్న పాల్గొన్నారు.

మూల సంఘ అధ్యక్షునిగా ప్రకాశరావు



మాట్లాడుతున్న ముసిలితల్లి సంఘ అధ్యక్షుడు ప్రకాశరావు

మునగపాక: ముసిలితల్లి మూల సంఘ అధ్యక్షునిగా పెంటకోట ప్రకాశరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ సర్వసభ్య సమావేశం ఆదివారం మునగపాకలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ప్రకాశరావు, కార్యదర్శిగా వేగి నాగేశ్వరరావు, కోశాధికారిగా వేగి పైడికొండ, డైరెక్టర్లుగా ఆడారి త్రినాథ్, సుంకర అప్పారావు, వేగి నాగేశ్వరరావు, బొడ్డేడ సన్యాశి అప్పారావు, ఆళ్ల త్రినాథ్, ఆడారి జగన్నాథరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు ప్రకాశరావు మాట్లాడుతూ ముసిలితల్లి మూల సంఘ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. పలువురు రైతులు పాల్గొన్నారు.

పరవాడ డీఎస్పీ సందర్శన

మునగపాక: స్థానిక పోలీసు స్టేషన్‌ను పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ ఆదివారం సందర్శించారు. ఇక్కడ పెండింగ్ కేసుల వివరాలను ఎస్‌ఐ ప్రసాదరావును అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. గంజాయి, మద్యం తదితర చెడు వ్యసనాలకు గురి కాకుండా యువతకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఘనంగా కనకదుర్గమ్మ రాట మహోత్సవం

మునగపాక: మండలంలోని నాగులాపల్లి సంత బయలలో కనకదుర్గమ్మ తల్లి రాటమహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గణ శంకర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భక్తులు భారీగా పాల్గొన్నారు. వేపచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాట నిలబెట్టారు. ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బొడ్డేడ బలరాం, మళ్ల బాబూరావు, ముచ్చకర్ల సత్యనారాయణ, మళ్ల వెంకటప్పారావు, మళ్ల నూకరాజు, బొడ్డేడ బుజ్జి పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లి గుడికి విరాళం

మునగపాక: స్థానిక చెరువు కాలువ సంఘ పరిధిలో సత్తెమ్మతల్లి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలువురు భక్తులు తమవంతు సాయం అందజేస్తున్నారు. దీనిలో భాగంగా మూలపేటకు చెందిన కాండ్రేగుల గాంధీ ఆలయ నిర్మాణానికి 25 బస్తాల సిమెంట్‌కు అవసరమయ్యే విరాళం అందజేశారు. కార్యక్రమంలో కర్రి రామజోగినాయుడు, బొడ్డేడ అప్పలనాయుడు, వెలగా వెంకటప్పారావు, ఆడారి జగ్గారావు, దాడి సూరప్పారావు, దాడి ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

దళితవాడలో అన్నసమారాధన

మునగపాక: స్థానిక దళితవాడలో ఆదివారం ఏర్పాటు చేసిన అన్నసమారాధనకు భక్తులు భారీగా తరలివచ్చారు. వినాయక ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అన్నసమారాధనను వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు పిల్లి అప్పారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అనంతరం పలువురు భక్తులు వినాయకున్ని దర్శించుకున్నారు.

టీడీఆర్ బాండ్లకు వ్యతిరేకం



నిర్వాసితులతో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

అచ్యుతాపురం రూరల్: రోడ్డు విస్తరణలో నిర్వాసితులు టీడీఆర్ బాండ్లకు వ్యతిరేకిస్తున్నారని సీపీఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు తెలిపారు. అనకాపల్లి రోడ్డు విస్తరణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హరిపాలెంలో నిర్వాసితులు చేపట్టిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. రోడ్డు విస్తరణలో కోల్పోతున్న ఇల్లు, స్థలాలు, భవనాలు, వ్యాపార సముదాయాల బాధితులకు 2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలని కోరారు. వీరికి టీడీఆర్ బాండ్లకు బదులు నగదు చెల్లించాలని డిమాండ్ చేశారు. రేటు నిర్ణయించిన రోజు నుంచి ప్రకటించిన ధరకి రేట్ ఆఫ్ ఇంట్రస్ట్ చెల్లించాలన్నారు. వందడుగుల తర్వాత ఎటువంటి నిర్మాణాలు చేపట్టినా ఆటంకం కలిగించకూడదన్నారు. ఇల్లు, షాపులు కోల్పోయిన వారికి పునరావాసం కల్పించాలన్నారు. స్ట్రక్చర్ విలువని ప్రస్తుత నిర్మాణ ధరలకు రెట్టింపు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నిర్వాసితుల సంఘం కన్వీనర్ రొంగలి రాము, రైతు సంఘం అధ్యక్షులు కర్రి అప్పారావు, బ్రహ్మాజీ, బాబూరావు, రామ్ కుమార్, నాయుడు, రంగారావు పాల్గొన్నారు.

పోరాట యోధుడు సీతారాం ఏచూరి



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

రాంబిల్లి(అచ్యుతాపురం): సమ సమాజ స్థాపన కోసం కామ్రేడ్ సీతారాం ఏచూరి తన జీవితాన్నే ధారబోశారని రాంబిల్లి మండలం సీపీఎం కార్యదర్శి జీ దేవుడు నాయుడు తెలిపారు. ఆదివారం రాంబిల్లిలో కామ్రేడ్ సీతారాం ఏచూరి మొదటి వర్ధంతిని పురస్కరించుకుని సీపీఎం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవుడునాయుడు మాట్లాడుతూ కార్మికులు, కర్షకుల కోసం సీతారాం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. లౌకిక వాదం కాపాడాలని, రాజ్యాంగాన్ని పరిరక్షించాలని నిరంతరం పోరాట యోధుడిలా ఉండేవారని అన్నారు. ఇప్పటి తరం నేతలు స్ఫూర్తిగా తీసుకొని ప్రజల కోసం పోరాటాలు చేయాలని, అక్కడి వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో చందక రామకృష్ణ, వై.రాము, ధోని కాసియా, భూపతి అప్పారావు, డి.నర్సింగరావు, వి.ఆదిరెడ్డి, శ్రీను, పారిపిల్లి పాల్గొన్నారు.

సర్పంచ్ వెంకటరమణ త్వరగా కోలుకోవాలి



సర్పంచ్ వెంకటరమణను పరామర్శిస్తున్న కంబాల జోగులు

ఎస్.రాయవరం: అనారోగ్యంతో శస్త్ర చికిత్స చేయించుకున్న పెదఉప్పలం సర్పంచ్ త్వరగా కోలుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు తెలిపారు. తిమ్మాపురంలో వ్యాపార దుకాణం వద్ద సర్పంచ్ కోశెట్టి వెంకటరమణను ఆదివారం ఆయన పరామర్శించారు. ఆరోగ్య క్షేమం గురించి అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, వాకపాడు సర్పంచ్ మైలపల్లి శ్రీనివాసరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధువర్మ, నాయకులు మణిరాజు, తిమ్మాపురం ఎంపీటీసీ బొండా దివాణం పాల్గొన్నారు.

భగవద్గీత ప్రశాంత జీవనమార్గం



భగవద్గీతపై అవగాహన కల్పిస్తున్న బోధకుడు పరదేశినాయుడు

మునగపాక: ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవడం ద్వారా జీవితం సుఖమయంగా ఉంటుందని విశ్రాంత ఇంజినీరింగ్ అధికారి శరగడం పరదేశినాయుడు పేర్కొన్నారు. మండలంలోని తిమ్మరాజుపేటలో వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో భగవద్గీత శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భగవద్గీతపై అవగాహన పెంచుకోవడం ద్వారా ప్రశాంత జీవితం సాగించవచ్చన్నారు. మానసిక ప్రశాంతత దొరుకుతుందన్నారు. చదువులో రాణించవచ్చన్నారు. ప్రతీ ఆదివారం జరిగే ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.